సంపుటి :02 సంచిక :196 పేజీలు :05 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people





ఏసీబీకి గాలానికి చిక్కిన

# టౌన్ ప్లానింగ్ చేప

- వెంచర్ అనుమతుల జారీకి రూ.5 లక్షలు డిమాండ్
- బాధితుడి నుంచి రూ.3.50 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

04

శనివారం 27, సెప్టెంబర్ 2025



## ఏ క్షణంలోనైనా

# ఎన్నికల షెడ్యూల్

### ఆర్థిక, ఎక్సైజ్, పంచాయతీరాజ్ శాఖలతో ఎస్ఈసీ భేటీ

స్థానిక సంస్థల ఎన్నికలకు తెరలేచింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియ ఒక్కసారిగా ఊపందుకుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఇప్పటికే కీలక శాఖల అధికారులతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షించింది. హైకోర్టు తీర్పు వెలువడగానే మూడు దశల్లో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నెల 30వ తేదీ లోపే నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తుండగా, గ్రామాల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

- హై కోర్టులో దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం స్పందనపై ఉత్కంఠ
- అంతా సజావుగా జరిగితే షెడ్యూల్ ప్రకటన వెలువడే అవకాశం
- మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు
- బీసీ కోటాపై జీవో విడుదలైన నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికలపైనే చర్చ

02




# భారీగా ఐపీఎస్‌ల బదిలీ

## హైదరాబాద్ సీపీగా సజ్జనార్

### హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్


అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలో భారీ సంఖ్యలో ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. సీనియర్లతో సహా 23 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారిలో హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ పోలీసు కమిషనర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.

03

# బీసీ కోటా జీవో రద్దు పిటిషన్‌పై హైకోర్టు విచారణ

- రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన ఏడీ సుదర్శన్‌రెడ్డి
- సర్కార్ విడుదల చేసింది జీవో మాత్రమేనని.. గెజిట్ కాకపోవచ్చని వాదన
- రిజర్వేషన్ల కోటా 50శాతం దాటడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన పిటిషనర్ తరఫు న్యాయవాది
- విచారణను వచ్చే నెల 8కి వాయిదా వేసిన న్యాయస్థానం

02




### జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు

# రిజర్వేషన్లు ఖరారు

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కీలక దశకు చేరుకుంది. జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జడ్పీటీసీ), మండల పరిషత్ అధ్యక్ష స్థానాలకు (ఎంపీపీ) రిజర్వేషన్లు ఖరారు కావడంతో రాజకీయ వేడి రాజుకుంది. వరంగల్ జిల్లాలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రక్రియలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కేటగిరీలకు లాటరీ పద్ధతిలో కోటా కేటాయించారు. మొత్తం 11 జడ్పీటీసీ, 11 ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లు పూర్తయ్యాయి. ఈ పరిణామంతో అన్ని రాజకీయ పార్టీలు స్థానిక పోరుకు అభ్యర్థుల ఎంపిక, వ్యూహ రచనపై దృష్టి సారించాయి. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నందున, జిల్లాల్లో ఎన్నికల సందడి మొదలైంది.

—అక్షరదర్బార్, వరంగల్

వరంగల్ జిల్లాలో మొత్తం జడ్పీటీసీ స్థానాలు 11

ఎస్సీలకు 2, ఎస్టీలకు 2, బీసీలకు 5, జనరల్‌కు 2 కోటా

మొత్తం ఎంపీపీ స్థానాలు 11

ఎస్సీలకు 2, ఎస్టీలకు 2, బీసీలకు 5, జనరల్‌కు 2 కోటా

02





## ఎమ్మెల్యేల అనర్హత

# పిటిషన్ల విచారణ షెడ్యూల్ విడుదల

- ఒక్కో ఎమ్మెల్యేను విడిగా విచారించనున్న స్పీకర్
- ఎల్లుండి నుంచి విచారణ షురూ

03

# స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు

## - రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డ్రా తీసిన కలెక్టర్




అక్షరదర్బార్, హనుమకొండ: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లను శనివారం ఖరారు చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జిల్లాలోని 12 ఎంపీపీ, 12 జడ్పీటీసీ స్థానాలు ఉండగా ఇందులో మహిళా స్థానాలకు సంబంధించి రిజర్వేషన్లను డ్రా తీశారు. ముందుగా ఎంపీపీ స్థానాలకు సంబంధించి రిజర్వేషన్ల డ్రా తీయగా అనంతరం జడ్పీటీసీ స్థానాలకు డ్రా తీశారు. రిజర్వేషన్ల ప్రకటన, మహిళా రిజర్వేషన్ స్థానాలకు డ్రా ప్రక్రియ మొత్తం వీడియోగ్రఫీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో రవి, డీఆర్డీవో మేన శ్రీను, డీటీవో శ్రీనివాస్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్ రావు, కొలను సంతోష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నిశాంత్, రజినీకాంత్, శ్యామ్ సుందర్, కొట్టె ఏసోబు, ప్రవీణ్ కుమార్, నేహాల్ తదితరులు పాల్గొన్నారు.



# ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్

- ఆర్థిక, ఎక్సైజ్, పంచాయతీరాజ్ శాఖలతో ఎస్ఈసీ భేటీ
- హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై న్యాయస్థానం స్పందనపై ఉత్కంఠ
- అంతా సజావుగా జరిగితే షెడ్యూల్ ప్రకటన వెలువడే అవకాశం
- మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు
- బీసీ కోటాపై జీవో విడుదలైన నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికలపైనే చర్చ




**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

తెలంగాణలో ఏ క్షణమైనా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముంది. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూలు ప్రకటించేందుకు పలు శాఖల అధికారులతో శనివారం సమావేశమైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ) రాణికుముదిని అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి సీఎస్ రామకృష్ణారావు, అదనపు డీజీ మహేశ్ భగవత్, పంచాయతీరాజ్, ఆర్థిక శాఖల ముఖ్యకార్యదర్శులు, ఎక్సైజ్‌శాఖ కమిషనర్ హాజరయ్యారు.మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ నెల 30వ తేదీ లోపు ఎలక్షన్ షెడ్యూల్ విడుదల చేయాలని రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘాన్ని తెలంగాణ సర్కార్ కోరిన సంగతి తెలిసిందే. రిజర్వేషన్ల నివేదికలు అందగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వం శనివారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. కోర్టులో కేసులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న ఎలక్షన్ కమిషన్.. హైకోర్టులో మాధవరెడ్డి అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం ఏమైనా అదేశాలు ఇస్తే దాన్ని బట్టి ఎస్ఈసీ తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఎలక్షన్ నిర్వహణకు ఎలక్షన్ కమిషన్.. ఎక్సైజ్, పోలీస్, పంచాయతీ రాజ్ శాఖల నివేదికలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మొదటగా ఎంపీటీసీ, తర్వాత సర్పంచ్ ఎన్నికలకు కసరత్తు మొదలపెట్టనుంది. షెడ్యూల్ విడుదలైతే వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో (హైదరాబాద్, మేడ్చల్ పట్టణ జిల్లాలు మినహా) ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్) అమలులోకి వస్తుంది.

### - బీసీ కోటా 42శాతం..

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జీవో ఆధారంగా వెంటనే స్థానిక ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం తెలియజేయడంతో పాటు వచ్చే 15 నుంచి 18 రోజుల్లో ఈ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కు ప్రభుత్వం లేఖ (కాంకరెన్స్) పంపించినట్టు విశ్వసనీయ సమాచారం. షెడ్యూల్ విడుదలైన వెంటనే మూడురోజుల వ్యవధిలోనే అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తారని తెలుస్తోంది. గ్రామ పంచాయతీల వారీగా, వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాలు ఎస్ఈసీ వెబ్‌సైట్ 'టీ–పోల్'లో ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. ఎన్నికల విధులపై సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. బ్యాలెట్ పేపర్ల ముద్రణకు చేయాల్సిన ఏర్పాట్లతో పాటు బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకోవడం వంటి ఏర్పాట్లకూ ఎస్ఈసీ గతంలోనే చర్యలు చేపట్టింది. బ్యాలెట్ బాక్సలు భద్రపరచడం, కౌంటింగ్ కేంద్రాలు, పోలీసు భద్రత తదితరాలపై కసరత్తు పూర్తిచేసింది.

### - ఎక్కడ చూసినా ఎన్నికల గురించే చర్చ..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటా 42శాతం కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం జీవో జారీ చేసిన నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికలపై చర్చ జోరుగా సాగుతున్నది. ఎన్నికలపై సోషల్‌మీడియాలో పోస్టులు, వాట్సాప్ సందేశాలు వైరల్ అవుతున్నాయి. ముందు ప్రాదేశిక ఎన్నికలు జరుగుతాయా.. పంచాయతీ ఎన్నికలు జరుగతాయా అన్న చర్చతో పాటు రిజర్వేషన్లపైనా చర్చ సాగుతున్నది. గ్రామస్థాయి నేతలంతా ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఎవరికి వారు వారికి తెలిసిన అధికారులు, సిబ్బందికి కాల్ చేసి రిజర్వేషన్లపై ఆరా తీస్తున్నారు.

### - ప్రాదేశిక ఎన్నికలే ముందు..

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు ముందు నిర్వహిస్తారా? లేక గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారా? అన్న దానిపై ప్రభుత్వ పరంగా పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నందున.. వాటి ద్వారా రాజకీయంగా లబ్ధి పొందేందుకు వీలుగా తొలుత పార్టీ గుర్తులపై జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిపేందుకే మొగ్గు చూపొచ్చని సమాచారం. ఈ ఎన్నికలు ముగిశాక వారం రోజుల వ్యవధిలోనే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. హైదరాబాద్, మేడ్చల్ అర్బన్ జిల్లాలు మినహా 31 జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీపీలు)లకు.. 565 జడ్పీటీసీ స్థానాలకు (ములుగు జిల్లా మంగపేట మండలం జెడ్పీటీసీ స్థానంపై కోర్టు కేసు కారణంగా స్టే) 565 మండల ప్రజా పరిషత్‌లకు (మంగపేట మండలంపై కోర్టు కేసు కారణంగా ఎంపీపీ, దాని పరిధిలోని ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికపై స్టే) ఎంపీటీసీ స్థానాలు 5,763 , గ్రామపంచాయతీలు–12,760 ,వార్డుల సంఖ్య 1,12,534. రాష్ట్రం ఏర్పాటయ్యాక మొదటిసారిగా 2019లో పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగాయి.



# జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

- వరంగల్ జిల్లాలో మొత్తం జడ్పీటీసీ స్థానాలు 11
- ఎస్సీలకు 2, ఎస్టీలకు 2, బీసీలకు 5, జనరల్‌కు 2 కోటా
- మొత్తం ఎంపీపీ స్థానాలు 11
- ఎస్సీలకు 2, ఎస్టీలకు 2, బీసీలకు 5, జనరల్‌కు 2 కోటా

అక్షరదర్బార్, వరంగల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం అన్ని జిల్లాల్లో ప్రాదేశిక స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. దీనిలో భాగంగా వరంగల్‌లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి రామిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, పంచాయతీ శాఖ అధికారుల సమక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రిజర్వేషన్లకు లాటరీ పద్ధతిన కేటాయింపు జరిగింది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కేటాయింపు జరిగింది. జిల్లాలో మొత్తం 11 జడ్పీటీసీ స్థానాల్లో రెండు స్థానాలు ఎస్టీలకు, రెండు స్థానాలు ఎస్సీలకు, ఐదు స్థానాలు బీసీలకు, మరో రెండు స్థానాలు జనరల్ కు కేటాయించారు. ఈ 11 స్థానాల్లో 5 స్థానాలు మహిళలకు కేటాయించారు. అలాగే జిల్లాలో మొత్తం 11 ఎంపీపీ స్థానాలు ఉండగా, రెండు స్థానాలు ఎస్టీలకు, రెండు స్థానాలు ఎస్సీలకు, 5 స్థానాలు బీసీలకు, మరో రెండు స్థానాలు జనరల్‌కు కేటాయింపుజరిగింది. వీటిలో 5 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగింది. సంబంధిత రిజర్వేషన్ స్థానాల కేటాయింపు వివరాలను గజిట్ లో ప్రచురిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు.

# బీసీ కోటా జీవో రద్దు పిటిషన్ పై హైకోర్టు విచారణ

- రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన ఏడీ సుదర్శన్‌రెడ్డి
- సర్కార్ విడుదల చేసింది జీవో మాత్రమేనని.. గెజిట్ కాకపోవచ్చని వాదన
- రిజర్వేషన్ల కోటా 50శాతం దాటడంపై పిటిషనర్ తరపు న్యాయవాది అభ్యంతరం
- విచారణను వచ్చే నెల 8కి వాయిదా వేసిన న్యాయస్థానం
- ఈలోపు ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చినా, మెరిట్ ప్రకారం విచారిస్తామని స్పష్టీకరణ

అక్షరదర్బార్, హైదరాబాద్:

బీసీ రిజర్వేషన్లపై శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో రద్దు చేయాలంటూ దాఖలైన హౌస్‌మోషన్ పిటిషన్‌పై విచారణ చేపట్టేందు కు శనివారం హైకోర్టు అనుమతించి విచారణ చేపట్టింది. జస్టిస్ అభినందన్ కుమార్ శావిలి, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపడుతున్నది. బీసీ రిజర్వేషన్లపై రెడ్డి జాగృతి మాధవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవోను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. మూడు రోజుల క్రితమే ఈ రిజర్వేషన్లపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డి పిటిషన్ వేశారు. అయితే.. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా పిటిషన్‌ను విచారిం చలేమని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రప్రభుత్వం తరపున ఏడీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. శుక్రవారం రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన జీవో కేవలం జీవో అయి ఉంటుందని, గెజిట్ కాకపోవచ్చని స్పష్టం చేశారు. అలాగే పిటిషనర్ తరపు న్యాయవాది.. రాజ్యాంగ పరిమితుల ప్రకారం కోటా 50శాతం మించకూడదని, రాష్ట్రప్రభుత్వం ఆ పరిమితిని దాటుతూ జీవో జారీ చేసిందని వాదించా రు. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు అక్టోబర్ 8వ తేదీకి విచారణను వాయిదా వేసింది. ఈలోపు ఒకవేళ ఈసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినా, మెరిట్స్ ప్రకారం విచారణ చేపడతామని స్పష్టం చేసింది.



# పరకాలలో బతుకమ్మ సంబురాలు

- ప్రకృతిని, సాంప్రదాయాన్ని గౌరవించే పండుగ
- మున్సిపల్ కమిషనర్ సుష్మ

అక్షర దర్బార్, పరకాల: తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగ శనివారం పరకాల మున్సిపాలిటీ కార్యాలయంలో అట్టహాసంగా నిర్వహించబడింది. మున్సిపల్ కమిషనర్ సుష్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో తమ తమ బతుకమ్మలను అలంకరించి, ఆటపాటలతో ఆ హరివిల్లు లాంటి వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా కమిషనర్ సుష్మ మాట్లాడుతూ "బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక. ఇది ప్రకృతిని, సాంప్రదాయాన్ని గౌరవించే పండుగ. మన సంస్కృతిని భావితరాలకు అందించే ఒక గొప్ప అవకాశం" అని పేర్కొన్నారు.









# భూపాలపల్లి జిల్లా కోర్టులో బతుకమ్మ సంబరాలు

- పాల్గొన్న ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్.దిలీప్ కుమార్ నాయక్

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్.దిలీప్ కుమార్ నాయక్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి.అఖిల పాల్గొని బతుకమ్మ ఆటలు ఆడారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితావని అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వి. శ్రావణ్ రావు మహిళా కార్యదర్శి ప్రియాంక , లైబ్రరీ సెక్రటరీ కంప అక్షయ కోశాధికారి మంగళపల్లి రాజ్ కుమార్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇందరపు శివకుమార్, కే.సుధారాణి, కనపర్తి కవిత తదితరులు పాల్గొన్నారు.

# మేనం శ్యామ్ కి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు

అక్షర దర్బార్, మల్హర్ : తెలుగు భాష కల్చరల్ అసోసియేషన్ గాంధీనగర్, విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ నుంచి ప్రజా వాయిస్ సీఈవో మేనం శ్యామ్ ఉత్తమ జర్నలిస్టు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిజం పేద ప్రజల సమస్యలను ప్రతిబింబించే విధంగా ఉండాల్సిన అవసరాన్ని, ఇటువంటి కార్యక్రమాలు జర్నలిస్టులను ప్రోత్సహిస్తున్నాయని, డాక్టర్ ధనాశి ఉషారాణి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ

# షెడ్యూల్ విడుదల

- ఒక్కో ఎమ్మెల్యేను విడిగా విచారించనున్న స్పీకర్
- ఎల్లుండి నుంచి విచారణ షురూ



అక్షరదర్బార్, హైదరాబాద్: బీఆర్ ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ షెడ్యూల్ విడుదలైంది. సోమవారం విచారణ ప్రారంభం కానుంది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తొలిరోజు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిని విచారించనున్నారు. అక్టోబర్ 1న మరోసారి విచారణ కొనసాగనుంది. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్‌లు శుక్రవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిశారు. మధ్యాహ్నం అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఒక్కో ఎమ్మెల్యే స్పీకర్‌ను కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. స్పీకర్ ఇచ్చిన నోటీసులకు సమాధానమిచ్చేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఇవ్వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పీకర్‌ను కోరినట్లు సమాచారం.

# తప్పిన పెను ప్రమాదం

### ఆర్టీసీ బస్సును వెనుక నుండి ఢీ కొట్టిన మరో బస్సు



అక్షర దర్బార్, పరకాల: పరకాల అంబేద్కర్ సెంటర్ వద్ద శనివారం ప్రమాదం తలెత్తింది. భూపాలపల్లి నుండి వస్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సు, అదుపు తప్పి పరకాల డిపోకు చెందిన మరో బస్సును వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో బస్సులో ఉన్న కొంతమంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు కాగా, వారిని 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు స్థానికులు తెలిపారు. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పినట్టు అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన బస్సు బ్రేక్ ఫెయిల్యూరేనా? లేక డ్రైవర్ అజాగ్రత్తేనా? అన్న విషయంపై ఆర్టీసీ అధికారులు దర్యాప్తు చేయాలని కోరారు.

# భారీగా ఐపీఎస్‌ల బదిలీ

- హైదరాబాద్ సీపీగా సజ్జనార్
- హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలో భారీ సంఖ్యలో ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. సీనియర్లతో సహా 23 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారిలో హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ పోలీసు కమిషనర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు ఉన్నారు.

# నడికూడ మండలంలో రోడ్డు పనులు ప్రారంభం



అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలంలోని వెంకటేశ్వర పల్లి నుండి నర్సింగాపూర్ వరకు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా రూ.1.60 లక్షలు మంజూరుకాగా పనులు చేపట్టారు. పీఆర్ ఇంజనీరింగ్ విభాగం 2023 సెప్టెంబర్ 5న పనులను ఆమోదించగా, గత డిసెంబర్ 28న ఒప్పందం జరిగింది. కాంట్రాక్టర్ సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నట్లు ఏఈ ఉదయ్ కుమార్ తెలిపారు.

# నర్సంపేట డివిజన్ లో ఖరారైన జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు

అక్షర దర్బార్, నర్సంపేట : తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు మొదటి అడుగు పడింది. నర్సంపేట డివిజన్ లోని 6 జెడ్పీటీసీ, 6 ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటించారు. జెడ్పీటీసీ స్థానాల్లో : నర్సంపేట (ఎస్టీ మహిళ), ఖానాపూర్ (ఎస్టీ జనరల్), నల్లబెల్లి (బీసీ జనరల్), నెక్కొండ (బీసీ జనరల్), దుగ్గొండి (జనరల్), చెన్నారావుపేట (జనరల్ మహిళ), ఎంపీపీ స్థానాల్లో .. నర్సంపేట ఎంపీపీ (ఎస్టీ జనరల్), ఖానాపూర్ (ఎస్టీ మహిళ రిజర్వుడ్), దుగ్గొండి (జనరల్), నల్లబెల్లి (బీసీ జనరల్), నెక్కొండ (బీసీ మహిళ), చెన్నారావుపేట (జనరల్ మహిళ)గా ఎన్నికల అధికారుల ప్రకటించారు

# ఘనంగా ఏవైఎస్ ఆవిర్భావ దినోత్సవం



అక్షర దర్బార్, చిట్యాల : అంబేద్కర్ యువజన సంఘం (1033/77) ఆవిర్భవించి 48 సంవత్సరాలు పూర్తి చేసుకుని, 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని చిట్యాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్యలు పూలమాలలు అర్పించారు. అనంతరం మండల ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న పుల్ల మల్లయ్య, దొడ్డి కిష్టయ్యలు మాట్లాడుతూ.. అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు జె.బి. రాజు ఆధ్వర్యంలో 1033/77 రిజిస్ట్రేషన్ పొందినప్పటి నుంచి 48 ఏళ్లు పూర్తయి, నేడు 49వ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. కార్యక్రమంలో సంఘం సాంస్కృతిక కార్యదర్శి దాసారపు నరేష్, గడ్డం సదానందం, పర్లపల్లి కుమార్, అంబాల రాజు, పాముకుంట్ల చందర్, గుర్రం తిరుపతి, మైదం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తోటి మిత్రుడికి ఆర్థిక సాయం అందజేత

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం పెద్దకోడపాక గ్రామానికి చెందిన మంద జంపయ్య అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుమారుడు మంద సురేష్ తోటి పదో తరగతి మిత్రులు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో దాసి శ్రావణ్ కుమార్ , రంగు రాజేష్ , కోగిల సుమన్, పైండ్ల భాను , మోరే సుమన్ , కోగిల తిరుపతి , బైని కరుణాకర్ , అల్లూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఏసీబీ గాలానికి చిక్కిన టౌన్ ప్లానింగ్ చేప

- వెంచర్ అనుమతుల జారీకి రూ.5 లక్షలు డిమాండ్
- బాధితుడి నుంచి రూ.3.50 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

అక్షరదర్బార్, మేడ్చల్ : వెంచర్ వేసుకునేందుకు అనుమతులు జారీ చేసేందుకు రియల్టర్ నుంచి టౌన్ ప్లానింగ్ అధికారి భారీ మొత్తంలో డబ్బు డిమాండ్ చేశాడు. బాధితుడి నుంచి సొమ్ము తీసుకుంటుండగా అవినీతి నిరోధకశాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మేడ్చల్ జిల్లాలోని ఎల్లంపేట్ మున్సిపల్ కార్యాలయంలో రాధాకృష్ణారెడ్డి టౌన్ ప్లానింగ్ అధికారి పనిచేస్తున్నాడు. వెంచర్ అనుమతుల కోసం ఇటీవల ఒక రియల్టర్ కార్యాలయానికి వచ్చాడు. అనుమతుల జారీకి సదరు అధికారి రూ.5 లక్షల లంచం డిమాండ్ చేశాడు. తర్వాత బాధితుడు అవినీతి నిరోధకశాఖను ఆశ్రయించాడు. వారు పక్కా ప్లానింగ్‌తో శనివారం రంగంలోకి దిగారు. బాధితుడి నుంచి అధికారి రూ.3.50 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సదరు అధికారి వెంచర్ అనుమతులకు గతంలోనే రూ.లక్ష అడ్వాన్స్ తీసుకున్నట్లు తెలిసింది. ఏసీబీ అధికారులు మరోవైపు నిందితుడి ఇల్లు, కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు.

# హామీలు అమలు చేయని పార్టీలకు ఓట్ల అర్హత లేదు

అక్షర దర్బార్, సంగెంఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ శనివారం కుంటపెల్లి గ్రామంలో జరిగిన సంగెం మండల సమావేశంలో మాట్లాడుతూ, గత ఎన్నికల్లో వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ అమలు చేయని పార్టీలకు ప్రజల నుంచి ఓట్లు అడిగే అర్హత లేదని పేర్కొన్నారు.అధిక వర్షాలు, యూరియా కొరత, పంట రుణాల సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వాలు తగిన భరోసా కల్పించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు పాలక పార్టీలకు బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి మంద రవి, మండల కార్యదర్శి మహమ్మద్ ఇస్మాయిల్, నాయకులు గోనె రామ చందర్, సోమిడి రవి, జక్క అశోక్, రౌతు శ్రీను, నాలం కొమురయ్య, దుపాక రాజు తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ కాళీ ప్రసాద్ పరామర్శ..

అక్షర దర్బార్, పరకాల: పరకాల విలీన గ్రామం రాజపేటకు చెందిన దాసరి సమ్మయ్య, ముదిగొండ రఘు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శనివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీ ప్రసాద్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. ముదిగొండ రాము కుటుంబ పరిస్థితిని చూసి చలించిన డాక్టర్ కాళీప్రసాద్ వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. ఆయనవెంట బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్, ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, నడికూడ మండల అధ్యక్షులు ఎరుకల దివాకర్ ,బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



అక్షర దర్బార్, పరకాల: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యమని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. శనివారం పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆత్మకూరు, దామెర, నడికూడ, పరకాల మండలాల నుంచి వచ్చిన 111 మంది లబ్ధిదారులకు రూ.1.11 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు 2121 మందికి రూ.21.23 కోట్లు కళ్యాణ లక్ష్మి పథకం కింద, 2112 మందికి రూ.6.89 కోట్లు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించామని తెలిపారు.


# ఆపదలో అండగా పూర్ణ చారి



అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ పరిధి విలీన గ్రామం రాజీపేటలో ఇటీవల మృతి చెందిన ముదిగొండ రఘు కుటుంబ సభ్యులకు పరకాల తొమ్మిదో వార్డు తాజా మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి 50 కిలోల బియ్యం, కిరాణా సామాను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ధర్నా నారాయణ దాస్, వేముల అశోక్, వావిలాల రాజయ్య, కొర్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.







# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యేలు గండ్ర, రేవూరి
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా జయంతి వేడుకలు

అక్షర దర్బార్, భూపాలపల్లి : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితాంతం కృషి చేశారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి మంజూరునగర్ పాత కలెక్టరేట్ కూడలిలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాపూజీ తెలంగాణ తొలి తరపు ఉద్యమ నాయకుడు, నిబద్ధత కలిగిన గొప్ప రాజకీయవేత్త అని, ఆయన జీవితం భావితరాలకు ఆదర్శమని అన్నారు. బహుజన నేతగా పద్మశాలీల సంఘటనా కోసం ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమం కోసం మంత్రి పదవికి రాజీనామా చేసి మలిదశ ఉద్యమానికి స్ఫూర్తి కలిగించారని పేర్కొన్నారు. అనంతరం భూపాలపల్లి కలెక్టరేట్‌లోని ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు.

## నివాళులర్పించిన ఎమ్మెల్యే రేవూరి.

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం, పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ నిజమైన ప్రజా నాయకుడు, ప్రజల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు అని అన్నారు. అదేవిధంగా పరకాల మున్సిపాలిటీలో బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి కమిషన్ సుష్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## సంగెం మండలంలో..

అక్షర దర్బార్, సంగెం: సంగెం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకలను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రతినిధి కందగట్ల నరహరి మాట్లాడుతూ బాపూజీ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ తొలి తరపు ఉద్యమకారుడు, మలిదశ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన నాయకుడని గుర్తు చేశారు. మంత్రి పదవిని త్యజించి, తెలంగాణ కోసం జీవితాంతం పోరాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిట్ల సత్యనారాయణ, మెట్టుపల్లి మల్లయ్య, గుండేటి బాబు, ఆగపాటి రాజు, మునుకుంట్ల మోహన్, పులి సాంబయ్య, అనుమాండ్ల రమేష్, బూర ప్రకాష్, చిందం వీరస్వామి, దశరథం, ఇప్పకాయల రమేష్ బాబు, ఇప్పకాయల మనోహర్, బిట్ల రామకృష్ణ, కందగట్ల వెంకటేశ్వర్లు, సంపత్, ఇప్పకాయల విజయ్ ప్రకాష్, అవధూత వెంకటేశ్వర్లు, పేరాల లక్ష్మీ నరసయ్య, బిట్ల లక్ష్మణ్, బిట్ల శ్రీను, బిట్ల వేణు, నల్ల రాజు, పులిపాటి లింగమూర్తి, మధు పాల్గొన్నారు.

## శాయంపేట మండలంలో..

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండల కేంద్రంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. టీఆర్పీఎస్ మండల అధ్యక్షుడు సామల మధుసూదన్ ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ జీవితం త్యాగం, పోరాటానికి ప్రతీకగా నిలిచిందని, నిజాం నిరంకుశ పాలన, క్విట్ ఇండియా ఉద్యమం, సాయుధ పోరాటం, 1969 తెలంగాణ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బాసని లక్ష్మీనారాయణ, సదాశివుడు, బాసని చంద్రమౌళి, బడుగు రవీందర్, బూర ఈశ్వరయ్య, చందనాల జనార్ధన్, బడుగు సునీల్, దాసరి కుమారస్వామి, గుండ రమేష్, సామల శ్రీనివాస్, పసునుంటి రాజయ్య, కొలిపాక రాజేందర్, వంగరి శ్రీనివాస్, గుండ రవి, అడిదల రాజిరెడ్డి, చాడ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నల్లబెల్లి మండలంలో..

అక్షర దర్బార్ నల్లబెల్లి: నల్లబెల్లి మండల కేంద్రంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో సామాల వీరన్న, బొద్దుల నర్సయ్య నేతృత్వంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా, నిజాం రజాకార్ల దౌర్జన్యాలు, అగ్రకులాలు భూస్వామ్య, వెట్టిచాకిరి, అణిచివేత, బానిసత్వానికి వ్యతిరేకంగా తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారని అన్నారు. తన జీవితాన్ని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉడుత రాజు జక్కుల రవి కోల లింగయ్య భూస కుమారస్వామి, గుండెబోయిన రాజన్న, కన్నం సాల్మన్, బాబు, బుట్టి జయాకర్, తంగెళ్ళ వేణు, తాడెం చంద్రమౌళి పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనర్ కార్యాలయంలో..

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110 జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సన్ ప్రీత్ సింగ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో కొండా బాపూజీ స్ఫూర్తిదాయకమైన పాత్ర పోషించారని సీపీ తెలిపారు. కార్యక్రమంలో క్రైమ్స్ డీసీపీ గుణశేఖర్, అడిషనల్ డీసీపీలు రవి, సురేష్ కుమార్, ప్రభాకర్ రావు, బాలస్వామి, శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాపూజీ ఇంట్లో టీఆర్ఎస్ పుట్టింది

అక్షర దర్బార్, భూపాలపల్లి : తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కొండా లక్ష్మణ్ బాపూజీ గారి ఇంట్లో పుట్టిందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమం నుండి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు అనేక ప్రజా పోరాటాలు చేసిన బాపూజీని గుర్తించి ఆయన పేరు హార్టికల్చర్ యూనివర్సిటీకి పెట్టడం, ట్యాంక్‌బండ్‌పై విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా సీఎం కేసీఆర్ గౌరవించారని ఆయన గుర్తుచేశారు. జయంతి సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బాపూజీ విగ్రహానికి గండ్ర వెంకట రమణా రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రతిష్టాపన కమిటీ కన్వీనర్ ఎలగొండ రాజేంద్ర ప్రసాద్, కో–కన్వీనర్ అడ్డగట్ల శ్రీధర్, గొర్లవీడు గ్రామ సీనియర్ నాయకుడు నరసయ్య, పద్మశాలి కుల పెద్దలు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915